# జీవితంలో వెలుగు నింపిన దీపావళి



* రచన: శ్రీమతి పోతుకూచి కనకదుర్గ *

తూర్పు తెల్లవారింది. పక్షుల కిలకిల రావాలు మొదలు పెట్టాయి. బాల భాస్కరుడు, లేత కిరణాలు జగన్నాథం ముఖాన్ని తాకాయి. ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు. "అబ్బ! చాలా పొద్దెక్కింది. ఎన్నడూ లేంది ఇంత నిద్ర పట్టింది" అనుకున్నాడు. కిటికీలోంచి బయటకు చూశాడు. వాకిట్లో రిక్షా ఆగింది. "ఎవరొచ్చారో ఇంత ఉదయాన్నే" అనుకుంటూ ప్రక్కమీద నుంచి లేచి పెరట్లోకి దారితీశాడు కాలకృత్యాలు తీర్చుకొనే నిమిత్తం.

పెరటి నానుకునిఉన్న వంట గదిలోనుండి మాటలు వినబడుతున్నాయి. తన భార్య కాంతతో ఎవరు మాట్లాడేది. ఆ కంఠం తనకు సుపరిచితమైనదే. తన కూతురు రమది. రమ అత్తవారింటినుంచి ఎందుకు వచ్చినట్లు. కాపరానికి వెళ్ళి రెండు నెలలు పూర్తి కాలేదు. అతని మస్తిష్కం మొద్దుబారిపోయింది. ముఖం కడుక్కుని లోపల ప్రవేశించాడు జగన్నాథం. తన భార్య కాంతమ్మ మాటలు వినబడ్డాయి గదివద్ద ఆగిపోయాడు.

---

కావలసినన్ని కొనుక్కోడానికి యివి కానిరోజులండీ ఆ రెండు రూపాయిలుంటే పద్మకో జుబ్బా వచ్చునే, గాంధీకో పుస్తకం వచ్చునే. ఉదయానికి కాఫీపొట్లాం తెచ్చారా, మల్లెపూవుల కాఫీయేనా?

మొగవాడిపాలిట భార్య ఒక కమ్చీ - కానరాని దెబ్బలు కదలించే గుండెలు.

సన్నజాజి పందిర వెన్నెల జానకి. వీటన్నింటిమాట కేంగాని శ్రీమతి జేబులోవుంచిన సామాన్ల చీటీ జ్ఞాపకంగా తీసిచూస్తే__చాలావున్నాయి. రేపంటే ఆదివారం శలవు. ఓయ్...యివన్నీ తెచ్చుకు వచ్చేస్తానోయ్ అని నారాయణ బయలుదేరాడు.

అందాకా "ఏమండీ!" అని జానకమ్మ అందించినకందు కాని మరీ నడచాడు.

"పోనీలే అమ్మా ఇప్పటికయినా ఆ ఊబిలోనుండి బయటపడ్డావ్. ఒక్కగానొక్క ఆడపిల్లవు, మాకేం బరువుగాదు. అతగాడేవచ్చి నిన్ను తీస్కెళ్ళేదాకా ఇక్కడే ఉండు" అంటోంది.

అసలు జరిగిం దేమిటో జగన్నాధానికి అర్థంకాలేదు. లోపలకు అడుగుపెట్టాడు. తండ్రిని చూడగానే రమ తలవంచుకుంది.

"ఏమ్మా కులాసానా? నువ్వు ఒక్కదానివే వచ్చావా? అల్లుడు రాలేదేమిటి? కార్డుముక్క రాస్తే స్టేషనుకు వచ్చేవాడిని కదా! తగినంత సౌమ్యం తెచ్చిపెట్టుకుని ప్రశ్నించాడు కూతురుని, అసలు సంగతి రాబట్టాలనే ఉద్దేశ్యంతో.

"మీరుండండి. అది అసలే బెంబేలెత్తిపోతుంటే అన్ని ప్రశ్నలు ఒక్కసారి వేస్తే ఎలా సమాధానం చెప్తుంది. ఆ అత్తగారు, మొగుడు కలిసి ఏం అరడి పెట్టారో భరించలేక వచ్చేసింది. ఒక్క ఆడపిల్ల అని ఎంతో ముద్దుగా పెంచాను అలాంటిది........వాళ్ళ బానిసై బ్రతకటం దానికేం పట్టింది." కళ్ళు వత్తుకుంది.

భార్య ధోరణి జగన్నాధానికి చిర్రెత్తుకొచ్చింది.

"ఛీ..ఛీ...నువ్వు ఒక తల్లివేనా? కన్నకూతురు తెలియక ఏదో తప్పు చేస్తే, సరిదిద్దవలసిందిపోయి దాన్ని సమర్థిస్తున్నావా! రేపు నలుగురు ఏమనుకుంటారు. ఏమైనా ఆలోచించావా?" అసహనంగా అన్నాడు.

"చాలించండి మీ మాటలు ఇది మహానగరం. పల్లెటూరు కాదు. రోజులు మారాయి, భర్త భార్య చెప్పినట్లు నడుచుకోవాలి. అమ్మాయి బి. ఎ. ప్యాసయింది. ఉద్యోగం చేసుకుంటుంది. అంతేకాని అతగాడు ఆడించినట్లు ఆడటానికి అది కీలుబొమ్మకాదు." నిశ్చలంగా అంది కాంతమ్మ.

"చాల్లే సిగ్గులేకపోతే సరి! ఇది మహిళామండలికాదు నీ ఉపోద్ఘాతం చాలించు. కన్నకూతురి భవిష్యత్తు ఆలోచించు. లేకపోతే తల్లీ కూతుళ్లు అనుభవిస్తారు." అని

విసురుగా అక్కడినుండి వెళ్ళిపోయాడు లాయరు జగన్నాథం.

ఈ మగ మహారాజులంతే ఇంతే. ఏమిటో భార్య మీద తమ ప్రతాపం చూపిస్తారు అనుకుంది కాంతమ్మ.

"రమా మీ నాన్నగారి తత్వం నీకు తెలుసుగా. ఆయన కోపం ముక్కుమీదే ఉంటుంది" అంది కూతురి తల నిమురుతూ.

ఆమాత్రం అండదండలు, తల్లివి వుంటే చాలనుకుంది రమ.

రోజులు వారాలు గడిచాయి. తండ్రితో మాట్లాడా అంటేనే భయంగాఉంది రమకు. అంతకన్నా ముభావంగా తిరుగుతున్నాడు జగన్నాథం. తన ప్రాక్టీసు, కేసులు, క్లయింట్సు రావడం వెళ్లడం, ఇత్యాది విషయాలు తప్ప ఇంటి విషయాలు పట్టించుకోవడం మానేశాడు

కానీ అతని ఆలోచనలు తీరిక సమయంలో రమను గురించే వచ్చేవి. తన అల్లుడు సారథి చాలా మంచివాడు. ఒకసారి ఏదో కేసు విషయంలో సారథి తనకు పరిచయ మయ్యాడు, అతని రూపం వినయవిధేయతలు జగన్నాథాన్ని ఆకర్షించాయి. అతని పుట్టుపూర్వోత్తరాలు కనుక్కున్నాడు. కులం, శాఖ కలిసింది. కాకపోతే ఆస్తి ఏమీలేదు. తండ్రిలేడు, తల్లిఉంది, ఇద్దరు అన్నదమ్ములు. సారథి రెండవవాడు, పెద్దవాడికి చాలా దూరదేశంలో ఉద్యోగం. సారథికి బ్యాంకిలో ఉద్యోగం, నాలుగొందలు సంపాదించుకుంటాడు. నైట్ కాలేజీలో బి. కాం. చదువుతున్నాడు, ఫర్వాలేదు పైకివచ్చే అవకాశంవుంది, తన కూతురు సుఖపడుతుంది అనుకుని, రమ యిష్టంమీదే ఈ వివాహం జరిపించాడు.

కాంతమ్మకు ఈ సమ్బంధం ఎంతమాత్రమూ ఇష్టం లేదు, సణుగుతూనే ఉంది.

రెండు నెలలు గడిచాయి, సారథి దగ్గరనుంచి ఒక్క ఉత్తరమైనా రాలేదు. రమ రోజులు నిర్లిప్తంగా గడుపుతోంది. మనస్సు బావుండక అలా తన స్నేహితురాళ్ని చూసొద్దామని బయలుదేరింది. రమకు ముఖ్య స్నేహితురాళ్ళు పద్మ, కమల, సునీత, రాజేశ్వరి. వీరిలో ముగ్గురికి వివాహం అయింది. కమల, సునీత అత్తవారిళ్ళకు వెళ్ళిపోయారు. పద్మకు ఉన్న ఊళ్లోనే భర్తకు ఉద్యోగం అవడంవల్ల ఇక్కడే వుంది, రాజేశ్వరికి ఇంకా పెళ్ళి కాలేదు, టీచరుగా ఉద్యోగం చేస్తోంది.

"హల్లో......రమా ఎప్పు డొచ్చావ్? అంటూ రమను చెయ్యి పుచ్చుకుని లోపలకు లాక్కుపోయింది.

ఇల్లు చాలా పెద్దదే బావుంది అనుకుంది రమ. అవును మరి శ్రీకాంత్ ఆఫీసరుకదా మరి, "ఏమిటే మొద్దు అంతలా ఆలోచిస్తున్నావ్" నువ్వొచ్చి ఎన్నాళ్ళయింది, మీ శ్రీవారుకూడా వచ్చారా? నీ లైఫ్ ఎలావుంది? సారథిగారు చాలా మంచివారని విన్నాను.

"అమ్మను చూడాలనిపించి వచ్చేశాను" పద్మ ప్రశ్నలన్నిటికీ ఒక్క ముక్కలో సమాధానం చెప్పింది రమ, అసలు విషయాన్ని దాచిపెట్టి.

"నిజంగా చాలా మంచివారే మీ శ్రీవారు, మా శ్రీవారయితే అమ్మను చూడాలనివుంది అంటే ఊళ్ళోనే కదా కారులో నన్ను తీస్కెళ్ళి చూపించి మళ్ళీ వెంటనే లాక్కొస్తారు, ఒక్కపూట ఉంటానన్నా ఉండనివ్వరు, అని ఆగి......నేను ఒక్క క్షణం కనబడకపోతే ఆయనకు తోచదట. ఆ ఒక్క పట్టుదల తప్పించి చాలా మంచివారు, నేనంటే ఎంత ప్రేమనుకున్నావ్!" పద్మ చెప్పుకుపోతోంది గర్వంగా, రమకామాటలు తలకెక్కడంలేదు, దేనినుంచి తను దూరంగా పారిపోవాలని వచ్చిందో? అదే తనకు పద్మ భర్తను గురించి పొగడటం నచ్చలేదు.

"పద్మా...మ్యాట్నీషోకి పిక్చరుకి పోదాంవస్తావా?" మనం కలిసివెళ్ళి చాలారోజు లయింది రమ అడిగింది.

పద్మ ఒక్కసారి రమ కళ్ళలోకి చూసింది ఆశ్చర్యంగా. రమ ఎందుకు ఇలా ఉంది అనుకొని తనకై తనుచెప్పనప్పుడు అడగటం ఎందుకని ఊరుకుంది. భర్త గురించి మాట్లాడినప్పుడు రమ చిరాకు గమనించింది పద్మ.

"రావడానికి నాకేం అభ్యంతరంలేదు కానీ...మా శ్రీవారు ఒకవేళ భోజనానికి ఇంటికి వస్తారేమో. రానని చెప్పారనుకో... సరే పద రెండుగంట అయింది" ఇంటికి తాళంవేసి నౌకరుతో చెప్పి కాలినడకను బయలుదేరారిద్దరూ. నాలుగడుగులు వేశారోలేదో తమ ముందునుంచి కారు దూసుకుపోయింది. అందులో శ్రీకాంత్‌ని చూసింది పద్మ.

"అరె! ఆయన వచ్చారే రమా... నేను రాలేను సినిమాకి. ఇంటికి వెళ్దాంరా"అని వెనక్కిలాక్కునిపోయింది రమను. చేసేదిలేక పద్మనను సరించింది రమ.

శ్రీకాంత్‌కు పరిచయం చేసింది రమను పద్మ. ప్రతి నమస్కారం చేసింది రమ.

"మీరేదో సినిమాప్రోగ్రాం వేసుకున్నట్లుండే! నేను హోటల్లో భోజనంచేస్తాను వెళ్ళండి పద్మా. మరేం ఫర్వాలేదు ఒక్కపూటకి" అన్నాడు.

“వెధవ సినిమా చూడకపోతే కొంప మునిగిపోవటం లేదు. రేపు చూడొచ్చు. భర్త ఆకలితో ఇంటికివస్తే... నన్ను చూసి ఆనందించమంటారా. మీకు హోటల్ భోజనం పడదు. నడవండి లోపలకు అంటూ అతన్నానుకున్నంతదగ్గరగా లోపలకు నడిచారు. రమకు ఈ చర్య చిర్రెత్తుకొచ్చింది. తను అక్కడున్న జ్ఞాపకంకూడా లేకుండా ఎలా వెళ్ళిందో అతగాడి వెనకాల. దీని డిగ్రీ ఏ గంగలో కలిపిందో! మహాపతివ్రతలై భర్త అడుగు జాడల్లో నడుస్తోంది కాబోలు. దానిరూపమే మారిపోయింది. కట్టూ బొట్టూ హైందవ నారిలా తయారయింది. ఏమీతోచక టేబిల్‌మీద మాగజైన్ తిరగవేయ సాగింది.

ఇంతలో లోపలనుండి నవ్వులువినిపించాయి. శ్రీకాంత్ పద్మ ఎంత హాయిగా నవ్వుతున్నారు. పద్మ సంసార జీవితం అంత ఆనందంగా ఉందా? ఇక అక్కడ వుండలేకపోయింది. ముళ్ళమీద కూర్చునట్లుంది తన పని. పద్మ తన ఉనికినే మరచిపోయినట్లుంది. పద్మతో చెప్పకుండా అక్కడనుంచి లేచి విసురుగా వచ్చేసింది. ఆ రావడం సరాసరి రాజేశ్వరి ఇంటికి చేరింది.

రాజేశ్వరి ఇంట్లోనే ఉంది. సాదరంగా ఆహ్వానించింది రమను. ఒంట్లో బావుండలేదని ఆరోజు సెలవు పెట్టింది. రాజేశ్వరి చాలా చిక్కిపోయినట్లు కనుపించింది. రాజేశ్వరికి ఎప్పుడూ ఏదో ఆలోచనలే. ఆసంగతే రమ అడిగింది.

“ఏముందీ మామూలే! నాకు పెళ్లి కాకపోవడం, నాన్న కట్నం ఇవ్వలేకపోవడం, అమ్మకి నా పెళ్లి కాదేమోనన్నదిగులు, చుట్టుప్రక్కలవారికి ఉద్యోగంచేస్తున్న నాగురించి అనుమానాలు. వీటిమధ్య నలిగిపోతున్న నాలాంటి మధ్యతరగతి అభాగినులు ఎలాఉంటాయి” మా జీవితాలు?

మధ్యలోనే అందుకున్న రమ “పెళ్ళిచేసుకున్న నేను పెళ్ళి కాని నువ్వు” ఒక్కలాగే ఉన్నాము.

“అంటే” ఆశ్చర్యంగా చూసింది రాజేశ్వరి. రమ ఇక దాచలేక అన్ని విషయాలు రాజేశ్వరికి చెప్పి నిట్టూర్పు విడిచింది.

ఈ విషయాలన్నీ విన్న రాజేశ్వరి రమంటే ఉన్న చనువుకొద్దీ చీవాట్లు వేసింది. సారథిగారు చాలా మంచి వారని నేను విన్నాను. కాకపోతే కొంతమంది పురుషులు తమ పురుషాహంకారాన్ని చంపుకోలేరు. తనమాట భార్య మన్నించాలి. భర్త భార్య కోర్కె తీర్చాలి. అంతేకాని ప్రతీమాట భార్య చెప్పటం భర్త చేయటం సహించదు.



ఇప్పటికయినా మించిపోయిందిలేదు. నీకు భర్తవద్ద ఉండడం భార్యకు గౌరవం. ఆయన మనసు తెలిసి మసలుకుంటే నిన్ను పువ్వుల్లోపెట్టి పూజించగలడు. నీసుఖాన్ని చేతులారా నాశంచేసుకోకు. మీ దాంపత్య జీవితం ఆనందంగా ఉండాలనే నేను కోరుతున్నాను. రేపు తప్పకుండా ప్రయాణం అవుతావుకదూ! ఆదరించి మాట్లాడింది రాజేశ్వరి. రమ ఆశ్చర్యపోయింది.

“నన్నాలోచించుకోనీ రాజేశ్వరీ” అని తల గిర్రున తిరిగిపోతున్నట్లనిపించింది. కాసేపుండి ఇంటికివచ్చేసింది. పద్మ సంసారం పదేపదే జ్ఞాపకానికి వస్తోంది. రాజేశ్వరికి పెళ్ళి కాకపోయినా సంసార జీవితాన్ని గురించి ఎంత చక్కగా మాట్లాడింది? తను పుట్టింటికి వచ్చి నాలుగు నెలలయింది. ఇక్కడ లభించే గౌరవం ఆనందం ఏమీ కనపించలేదు.

తిరిగి ఆయనవద్దకు వెళితే.....ఆలోచనతో శరీరం కంపించసాగింది. ఆయన్ను చీదరించుకువచ్చిన నేను ఆయనకు నాముఖం ఎలా చూపించను.

ఆ రోజు సారథి అన్న మాటల్లో తప్పుమాత్రం ఏమున్నది? తనవేషము నచ్చలేదని తనకు నచ్చినరీతిని చక్కగా ఎంత అనునయంగా చెప్పాడు. “రమా...ఆ బెల్ బాటమ్‌లు లుంగీలు, నైలాన్ చీరలు, మానేసి, ఇదుగో నేను తెచ్చిన కనకాంబరం రంగుజరీ చీర నీ కట్టుకురా ఒక్క జడ వేసుకో! ఎంత బావుంటావో! పెళ్ళయిన తరువాత చిన్నతనపు వేషాలు మానెయ్యాలి అన్నాడు.

దాంతో కస్సుమంది రమ. ఇద్దరికీ అభిప్రాయభేదాలు వచ్చాయి.

“నేను అమ్మమ్మలా తయారవడం మీకిష్టమైతేఒక్క క్షణంకూడా ఆ వేషంలో నేను ఈయింట్లో ఉండలేను. అంది”

“ఉండలేకపోతే వెళ్ళు. నన్ను నువ్వు ఏమన్నా సహించాను, చిన్నతనం గారంగా పెరిగావని ఊరుకున్నాను, నానాటికి నీప్రవర్తన హద్దులు మీరుతోంది. ఈరోజు ఉదయం అమ్మతో మాట్లాడినతీరు విన్నాను. పెద్దలయందు వినయ విధేయతలులేని నువ్వు ఇక్కడ వుండడం అనవసరం.”

“మీకు నామీద కోపం రావడానికి కారణం వెనకాల మీ అమ్మగారుకూడా ఉన్నారన్నమాట” వ్యంగ్యంగా అంది.

ఆమాటతో వివేకం కోల్పోయిన సారథి రమ చెంప చెళ్‌మనిపించాడు, తరువాత విచారించాడు.

ఆ అవమానాన్ని భరించలేక రమ తన సూట్‌కేసు

తీసుకొని బయలుదేరింది పుట్టింటికి. "రమా! ఒక్కమాట" సారథి పిలిచాడు. ముఖాన్ని కనబడనీయక అటుతిరిగి నిలబడింది రమ.

"నీ మనసు మార్చుకుని ఏనాటికైనా నావద్దకు రావాలనిపిస్తే తప్పకుండా రా, నాహృదయద్వారాలు నీకోసం ఎప్పుడూ తెరిచేఉంటాయి. కానీ...ఇంకో సంగతి, నేనే వచ్చి నీకాళ్ళమీద పడతానన్న వెర్రిభ్రమలో పడకు. అదిమాత్రం నిజం...అమ్మకికూడా నువ్వంటే ఎంత ఆప్యాయతో నీకు తెలుసు" అంటే రమ విసావిసా నడిచి కారెక్కి వచ్చేసింది.

ఆరోజు సారథి రూపం తన కళ్ళకు కట్టినట్లుంది. నేనే ఓడిపోయాను. నా అహంకారం నన్నే కాల్చేస్తోంది. నిద్ర రావడంలేదు, కళ్లు మంటలు. సారథి అన్న చివరి మాటలు చెవుల్లో గింగురుమంటున్నాయి. రేపు ఉదయం లేవగానే ఆయనవద్దకు వెళ్ళిపోతాను. ఒక నిశ్చయానికి వచ్చి తృప్తిగా నిద్రాదేవి ఒడిలోకి జారుకున్నది.


ఆరోగ్య సౌభాగ్యములకు మహిళలు
ఆధారపడునవి
ఆరోగ్య అనారోగ్య పరిస్థితులలో

లోధ్ర

♦

గర్భపోషణకు, సుఖప్రసవమునకు

గర్భరక్షక

♦

తెలిళ్ళకు, మలబద్ధకమునకు

మాదీఫలరసాయనం

♦

ప్రసవానంతరం బలమునకు, క్షీరవృద్ధికి

సౌభాగ్య శొంఠి

♦

కేసరి కుటీరం ప్రైవేట్ లిమిటెడ్.
మద్రాసు-14.
ఏజెంట్లు :
సీతారామ జనరల్ స్టోర్సు (ఏజన్సీస్)
విజయవాడ.


తెల్లవారుజామున తల్లి లేపింది. ఆరోజు దీపావళి తలంటుకుందువుగానిలే అని. తన ప్రయాణం సంగతి జ్ఞాపకం వచ్చింది, అమాంతం లేచికూర్చుంది.

తలంటుకుని భర్త తెచ్చిన చీర కట్టుకుంది. ఒక్కజడ వదులుగా వేసుకుంది. కనకాంబరాలు దండ పెట్టుకుంది, చెగోడీలలాంటి రింగులు తీసి ముత్యాల దుద్దులు పెట్టింది. దోసగింజ బొట్టు మానేసి, నయాపైసంత కుంకుమబొట్టు ముఖానికి పెట్టింది. కండ్లకు సన్నగా కాటుక పెట్టింది, అద్దంలో చూసుకుంది తన ప్రతిబింబాన్ని, సారథికి నచ్చినరూపం, భారత నారీరత్నం అనుకుని తనలో తానే నవ్వుకుంది.

ఏవో ఫైళ్లు చూసుకుంటున్న తండ్రి గదిలో అడుగు పెట్టింది. ఇన్నిరోజులు తండ్రి కూతుళ్ళకు మాటలులేవు, కూతురి రాకను గమనించి ఒకింత మురిసిపోయినా మళ్ళీ ఫైళ్ళలో తలదూర్చాడు జగన్నాథం.

"నాన్నా" మెడచుట్టూ చేతులువేసి బావురుమంది. పితృహృదయం కరిగిపోయింది, ఆమె వెన్ను నిమురుతూ ఉండిపోయాడు.

"నాన్నా! నేను ఆయనవద్దకు వెడతాను. ఇన్నాళ్లు మిమ్మల్ని బాధపెట్టినందుకు క్షమించండి" తండ్రి పాదాలను కళ్ళకు అద్దుకుంది.

'చాలా సంతోషం తల్లీ ఈ మాట కోసం నేను ఇన్నాళ్లుగా ఎదురుచూస్తున్నాను. అంతేకానీ నీమీద ప్రేమలేక కాదమ్మా, కానీ ఈవాళ అమావాస్య. వెళ్ళడం అంత సమంజసం కాదేమో' లోపల ఆనందంగా ఉంది జగన్నాథానికి.

'ఫర్వాలేదు నాన్నా. ఈ దీపావళి అమావాస్య తన సహజ వెలుగునేకాక, నా జీవితాన్నే వెలుగుతో నింపాలి నన్ను దీవించండి' అంది.

తల్లికి పాదాభివందనం చేసింది, ఆమె విస్తుపోయింది. కూతురి ప్రవర్తనకు నానామాటలు అంది. తండ్రి కూతుళ్లు తన్ని అవమానించారంది. జగన్నాథం కూతుర్ని రైలెక్కించి వచ్చి గర్వంగా నవ్వేడు. అడిగాచిన కాంతమ్మ టపాకాయల అవసరం లేకుండానే చిటపటమంది.

* * * *

తనకు నచ్చిన రీతిలో లోపలకు అడుగుపెట్టిన రమను చూసి ఆశ్చర్యపోయాడు సారథి. ఇంటిచుట్టూ దీపాల వెలుగు. ఆ వెలుగును మరపించే రమ సాక్షాత్కారం అతని ఆనందానికి మేరలేకపోయింది. 'ఏమండీ నన్ను క్షమించరూ?' అతని పాదాలమీద వాలిపోయింది రమ. ఆమెను లేవదీసి తన హృదయానికి హత్తుకున్నాడు. ఆరోజు దీపావళి కొన్నినెలలు ఎడబాసిన ఆ జంటను కలిపింది.